క్లుప్తంగా

పాఠశాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎంఈవో రామచంద్రరావు

దుంబ్రిగుడ: మండల కేంద్రంలో గురువారం స్కూల్ కాంప్లెక్స్ సీఆర్పీలు, పాఠశాలల హెచ్ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యుల ప్రత్యేక సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎంఈవో రామచంద్రరావు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల కమిటీ సభ్యులకు సామాజిక తనిఖీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణపై సీఆర్పీలు, తల్లిదండ్రుల కమిటీలు, హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలని సూచించారు. తరచూ సమావేశాలు నిర్వహించి పాఠశాలల ప్రగతి నివేదికను తెలియజేయాలన్నారు.

4న సీపీఎం మహాసభ

చింతూరు: స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వచ్చే నెల 4న చింతూరులో నిర్వహించనున్న మహాసభ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశ సంపదలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని, ప్రజలపై పన్నుల భారంతో పాటు నిత్యావసరాల ధరలు పెంచి నడ్డి విరిచిందన్నారు. చింతూరులో జరిగే బహిరంగ సభలో పార్టీ జాతీయ నాయకులు బృందాకారత్, రావూరి వెంకయ్య ఇతర నాయకులు పాల్గొంటారన్నారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీతారామయ్య, వెంకట్, శ్రీనివాసరావు, లక్ష్మణ్, సలీం పాల్గొన్నారు.

ప్రతి సోమవారం 'స్పందన'

పెదబయలు: కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ బి.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సోమవారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. పంచాయతీల పరిధిలో రెవెన్యూ సమస్యలపై స్పందనలో అర్జీలు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామ సచివాలయం పరిధిలో పరిష్కారం కాని వాటికి స్పందనలో దరఖాస్తు చేసుకోవచ్చని, మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనాథ చిన్నారులకు భోజనం



భోజనం అందజేస్తున్న దాతలు

సాక్షి, పాడేరు: పట్టణంలోని గుడివాడ వీధిలోని అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు వర్తనాపల్లికి చెందిన డప్పోడి పెద అప్పారావు కుటుంబం గురువారం రాత్రి సేవా కార్యక్రమం నిర్వహించింది. డప్పోడి వరహాలమ్మ జ్ఞాపకార్థం అప్పారావు, అతని కుమార్తెలు లక్ష్మి, నాగమణి, మంజుభార్గవిలు అనాథ చిన్నారులు రాత్రి భోజనం పంపిణీ చేశారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎంపీహెచ్ఈవో గంగరాజు, ఇమ్మానుయేల్, అనాథ ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

30న ఏకలవ్య పాఠశాలలో ప్రవేశానికి పరీక్ష

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కేంద్రంగా ఏకలవ్య పాఠశాలలో ప్రవేశ పరీక్ష 30న నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సత్యవేణి తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు పరీక్ష జరుగుతుందని, దరఖాస్తు చేసుకున్న అర్హులైన విద్యార్థులు 5వ తరగతి ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫోటో తీసుకొని రావాలని సూచించారు.

వైభవంగా కాళికామాత ఆలయం ప్రారంభం

గొలుగొండ: చీడిగుమ్మలలో నూతన కాళికామాత ఆలయ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, ఇతర ప్రాంతాలకు చెందిన దాతల సహకారంతో ఈ ఆలయాన్ని ఇటీవల కమిటీ నిర్మించింది. తెల్లవారు నుంచి ఆలయం వద్ద పండితులు పూజాధికాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడం కోసం వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం



ఈదులగరువులో గిరిజనులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అడుగులపుట్టులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న నేతలు



మినుములపుట్టులో పర్యటిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నేతలు



పెదవలసలో బ్రోచర్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కుమారి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్

హుకుంపేట: ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని రాప పంచాయతీ ఈదులగరువు, ఇరుకురాయి, కె.తాడిపుట్టు రీడేబంద గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 165 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ జగనన్న పాలనలో శివారు గ్రామాలు సైతం అభివృద్ధి జరుగుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల్లో రోడ్డు సమస్యను స్థానికులు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, సర్పంచ్ కొప్పుల దేవుడమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కోరాబు నాగలక్ష్మి, మండల యువజన కార్యదర్శి వెంకట్, నాయకులు లక్ష్మయ్య, సింహాచలం, చిన్నయ్య, పాత్రుడు, మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని అడుగులపుట్టు పంచాయతీల్లో తమరాడ, సంపంగిపుట్టు,తొరంగుల, సీకరిపుట్టు, కొత్తాపుట్టు గ్రామాల్లో గురువారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణారావు, గృహ సారథులు జలంధర్, భగత్‌రాయ్, నాగరాజు, వార్డు సభ్యులు కేశవరావు, దేవి, కార్యకర్తలు రామారావు, ధనుర్జయ్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ మినుములపుట్టు గ్రామంలో గురువారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, నేతలు జగమందు, జయదేవ్, తిరుపతి, గాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలసలో గురువారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, చింతపల్లి ఎంపీపీ అనూషాదేవి, వైస్ ఎంపీపీలు ఆనంద్ దేవుడు, ఏఎంసీ చైర్మన్ రామకృష్ణ, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ నాగమణి, నాయకులు రామకృష్ణ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: చిన్నగెడ్డలో జరిగిన కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలి, వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు పరమేష్, గృహసారథులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో గల పంచాయతీల్లోని పలు గ్రామాల్లో గురువారం ఎంపీటీసీ, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ వాలంటీర్లు, గృహ సారథులు మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మండలంలో సొలభం పంచాయతీ ఎగరచ్చపల్లి, నుర్మతి, గడుతూరు, వంజరి, గెమ్మెలి,సొలభం, పెదలోచలి, లువ్వాసింగ్, పాలమామిడి తదితర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిన్నారావు, పంచాయతీ కన్వీనర్లు ,గ్రామ వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

చింతూరు: మండలంలోని ముకునూరు, కొత్తపల్లి, రామన్నపాలెం, చదలవాడ, ఏడుగురాళ్లపల్లి సచివాలయాల పరిధిలో గురువారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ అర్జున్, సర్పంచ్‌లు సత్యకుమారి, తిరుపతమ్మ, రాజయ్య, నేతలు నాగరాజు, పవన్, శ్రీను, విప్లవ్ కుమార్, సీతారామరెడ్డి, పండురెడ్డి, రమేష్, లక్ష్మణ్, కన్నారావు, బాబూరావు, రాంబాబు, సుశీల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



చిన్నగెడ్డలో ప్రచారం చేస్తున్న కో-ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలి, పరమేష్



ఎగరచ్చపల్లిలో గ్రామస్తులకు కరపత్రాలు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు చిన్నారావు



ముకునూరులో పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎంపీపీ అమల, సర్పంచ్ సత్యకుమారి, నాయకులు

29 నుంచి షటిల్ టోర్నీ

జి.మాడుగుల: మత్స్యమాడుగులమ్మ అమ్మవారి మహోత్సవం పురస్కరించుకొని మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మత్స్యరాస రామకృష్ణంరాజు, కార్యదర్శి మత్స్యరాస నారాయణరాజు తెలిపారు. ఈ నెల 29 నుంచి మే2వ తేదీ వరకు నిర్వహించనున్న టోర్నీకి ఎంట్రీలు ఆహ్వానిస్తున్నామని, ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.5016, ద్వితీయ బహుమతి రూ.3016 నగదు, షీల్డులు అందజేయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 8074073449, 9493639093 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వృద్ధులకు భోజన సదుపాయం



వృద్ధులకు భోజనం అందజేస్తున్న ఎంపీటీసీ వంశీ

రంపచోడవరం: మండలంలోని తామరపల్లి గ్రామంలో స్వరూప ఫౌండేషన్ ద్వారా వృద్ధులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంస్థ తరఫున వృద్ధులకు రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందజేస్తున్నట్టు చెప్పారు. స్వరూప ఫౌండేషన్ ద్వారా మరన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మడి ప్రవీణ్‌ను అభినందించారు. వృద్ధుల కోసం తన వంతు సహకారం అందజేస్తామన్నారు.పాస్టర్ తమన్న, గ్రామ పెద్ద వెంకన్న, వేమన్న,కుంజం వెంకన్న తదితరులు పాల్గొన్నారు .

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సోందొర



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

జి.మాడుగుల: మండలంలోని గడుతూరు పంచాయతీలో మారుమూల వసమామిడి, జోడిమామిడి, నిట్టమామిడి, సీతబంద, ఆకుతోట, నెయ్యలబంద, బొందులపనుకు గ్రామాల్లో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది రోగులకు డాక్టర్ రొబ్బా సోందొర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు రోజూ ఆకుకూరలు, గుడ్లు తదితర పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కాన్పు సమయంలో సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చి వడపోసిన నీటిని వినియోగించాలని, దోమతెరలు వినియోగించాలన్నారు. వైద్య సిబ్బంది నాయుడు, రాజు, మణికుమారి,104 సిబ్బంది పాల్గొన్నారు.

56 మందికి వైద్య పరీక్షలు

ముంచంగిపుట్టు: మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ నడుమూరు, గాదేలబురుగు, చేపట్టు గ్రామాల్లో కిలగాడ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 56 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ వైద్య సేవలు అందించిన అనంతరం అవసరమైన వారిని ఆరోగ్య కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎంపీహెచ్ఈవో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల

రంపచోడవరం: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా సీటూ నాయకురాలు రామలక్ష్మీ అధ్యక్షతన గురువారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.నిర్మల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామరాజు మేడే వారోత్సవాలను కార్మికులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మేడే పోరాట స్ఫూర్తితో ప్రపంచంలో కార్మికులు 8 గంటల పని విధానం, కనీస వేతనాలు, కార్మికుల సౌకర్యాలు సాధించుకున్నారన్నారు. కార్మిక హక్కుల కోసం న్యాయ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఇంటర్‌లో సత్తాచాటిన గిరిజన విద్యార్థులు



జల్లేపల్లి స్టీఫెన్



నిరోష



పద్మశ్రీ



శ్రీవల్లి



సంధ్యారాణి

వై.రామవరం: అల్లూరి జిల్లా లో గురుకుల పాఠశాల విద్యార్థులు ఈ ఏడాది ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇందులో భాగంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులు తదితరులు అభినందనలు తెలిపారు. మండలంలోని పి.యర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఈ ఏడాది ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 75 మంది పరీక్షలు రాయగా 45 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 100 మందికి 68 మంది ఉత్తీర్ణులయ్యారు. వై.రామవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 43 మందికి 14 మంది ఉత్తీర్ణులు, ద్వితీయ సంవత్సరం 44 మందికి 24 మంది ఉత్తీర్ణులయ్యారు. పి.యర్రగొండ గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు గిరిజన విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనపరిచారు. మండలంలోని చవిటిదిబ్బలు గ్రామానికి చెందిన ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని కోసూరి సంధ్యారాణి 930 మార్కులు, బైపీసీ విద్యార్థిని గొర్లె నిరోష 907 మార్కులతో మండలంలో మొదటి స్థానం సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తోపాటు అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

రంపచోడవరం: ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో బైపీసీ సెకండియర్ విద్యార్థి జల్లేపల్లి స్టీఫెన్ 910 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు.విద్యార్థి కృషి, పట్టుదల, అధ్యాపకుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల నిరంతర పర్యవేక్షణ వలన ఉత్తమ మార్కులు సాధించినట్టు చెప్పారు. స్టీఫెన్ స్థానిక వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర తనయుడు.

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో చదువుతున్న బైపీసీకి చెందిన వర్రే పద్మశ్రీ సెకండియర్‌లో 884 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచినట్టు ప్రిన్సిపాల్ ఆర్.వి.మోహనరావు తెలిపారు. హెచ్ఈసీకి చెందిన విద్యార్థిని నెరం చిన్నారి (883) మార్కులతో, రేపల్లి చినతల్లి అనే విద్యార్థిని ఎంపీసీలో 792 మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రం బొడ్డచెట్టు కాలనీకి చెందిన బోయిన శ్రీవల్లి ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించింది. తగరపువలస శశీ ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలోని ఫస్ట్ ఇంటర్‌లో 435 మార్కులతో సాధించి, టాపర్‌గా నిలిచింది. విద్యార్థినికి శ్రీవల్లిని కుటుంబ సభ్యులు, జెడ్పీటీసీ గంగరాజు అభినందించారు.

విద్యార్థులకు హోమియో మందుల పంపిణీ

మాడుగుల రూరల్: జి. అగ్రహారం హైస్కూలు, ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు ఉచిత హోమియో మందులు గురువారం పంపిణీ చేశారు. వడ్డాది గ్రామానికి చెందిన అతిథిదేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం 300 మంది విద్యార్థులకు హోమియో మందుతోపాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరావు పంపిణీ చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూలు హెచ్ఎం ఎ. లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటన

దేవీపట్నం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం మండలంలో పర్యటించనున్నారు. శరభవరం సచివాలయ పరిధిలో శరభవరం గ్రామంలో మధ్యాహ్నం రెండున్నర గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీపీ కుంజం మురళి తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు కృషి

రంపచోడవరం: రాష్ట్ర ఆదివాసీ జేఏసీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ టి.బాబూరావు నాయుడు పిలుపు మేరకు మే 5న ఆదివాసీ జేఏసీ డివిజన్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర ఆదివాసీ జేఏసీ కోర్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్ తెలిపారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణకు జేఏసీ డివిజన్ కమిటీ తరఫున కృషి చేయాలన్నారు. రంపచోడవరంలో జరగనున్న కార్యక్రమానికి రాష్ట్ర ఆదివాసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ టి.బాబూరావు నాయుడు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఆదివాసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెద్దలు, మేధావులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొయ్యూరు: మండల కేంద్రంలో ఆదివాసీ జేఏసీ సమావేశం వచ్చే నెల 4న నిర్వహించనున్నట్టు జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజుబాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి వరలక్ష్మి, మండల కన్వీనర్ బూర్గులయ్యా, జిల్లా ప్రతినిధి సోమేష్ కుమార్ గురువారం తెలిపారు. బోయ వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీలో కలపాలని చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు గ్రామ స్థాయిలో కమిటీలను వేస్తామని వారు తెలిపారు.

ప్రకృతిసాగుతో ఆదాయం, ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మాకవరపాలెం: ప్రకృతి సాగుపై రైతులు దృష్టి సారించాలని సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ కోరారు. గురువారం కొండలఅగ్రహారం గ్రామంలో ప్రకృతి సాగుపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రకృతి సాగుతో రైతులకు పెట్టుబడి తగ్గడంతోపాటు అధిక దిగుబడి, ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందన్నారు. నవధాన్యాల సాగు– నేలతల్లి బాగు అనే అంశంపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలనాయుడు, కవిత, సుదర్శన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

కె.కోటపాడు: చౌడువాడ శివారు గరుగుబిల్లికి చెందిన అభయాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా పూజలతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారికి వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీపీసీఎస్ చైర్‌పర్సన్ ఆకుల సాయి ప్రసాద్, రొంగలి రమేష్, చల్లా సురేష్ ప్రత్యేక పూజలు చేశారు.

మరిడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం పాలగెడ్డ వద్ద మరిడిమాంబ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పసుపుకుంకుమలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం నుంచి ఆలయం వద్ద భజన కార్యక్రమం నిర్వహించారు.

ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సీతమ్మ, నేతలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో దూర్గగూడ కాలనీకి జిల్లా పరిషత్ నిధులు రూ.5లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ సీతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ మన్యంలోని గ్రామాలకు మహర్దశ నెలకొందన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యం వల్ల గిరిజనులు రవాణా కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మన్యంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకులు జగబందు, జయదేవ్, సన్యాసిరావు, తిరుపతిరావు, పిత్‌బాస్, దాసు, పులిరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లో తనిఖీలు



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

జి.మాడుగుల: మండలంలో భీరం, నుర్మతి, బొయితిలి గ్రామ సచివాలయాలను ఎంపీడీవో చంద్రశేఖరరావు గురువారం సందర్శించారు. వాటర్ ట్యాంక్‌ల క్లినింగ్ షెడ్యూల్ రిజిష్టర్, పాఠశాల, వసతి గృహాల బడిమానివేసిన పిల్లల రిజిష్టర్లు, వ్యాక్సినేషన్, హైరిస్కు గర్భిణుల మోనటరింగ్, రక్తహీనత పిల్లల నమోదు రికార్డులను తనిఖీ చేశారు. ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గ్రామ సచివాలయాల్లో రికార్డుల నిర్వహణ తప్పనిసరి అని సిబ్బందికి సూచించారు. ఉపాధి హామీ పథకం వేతనాలు పొందేవారి సమీకరణ గూర్చి ఆయన వివరించారు. సర్పంచ్ మాలన్న, ఈవోపీఆర్డీ ఎస్.జి.వి.ఎం.నాయుడు, పీఎస్ఎస్ చిన్నంనాయుడు, సచివాలయ ఉద్యోగులు శ్రీను, సతీష్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన మ్యుటేషన్ పత్రాల జారీ



మాట్లాడుతున్న సర్పంచ్ పండుదొర

రంపచోడవరం: మండలంలోని వేములకొండ పంచాయతీ పరిధిలోని సువర్లవడ గ్రామంలో సబ్ కలెక్టర్ శుభం బన్సాల్ ఆదేశాల మేరకు సర్పంచ్ కొమరం పండుదొర అధ్యక్షతన బుధవారం పేసా గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఎంపీటీసీ సభ్యుడు నర్రి పాపారావు, వార్డు సభ్యులు, వీఆర్ఓలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ పండుదొర మాట్లాడుతూ తమ పంచాయతీలో డీ పట్టాలు ఎక్కువగా ఉన్నాయని, కొన్ని ఆన్‌లైన్‌లో నమోదు కాలేదన్నారు. చట్ట ప్రకారం ఆడపడుచులకు ఆస్తి హక్కు ఉందన్నారు. మరణించిన వ్యక్తుల ఆస్తిని వారసులకు మ్యూటేషన్ చేసేందుకు అవసరమైన పత్రాల జారీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు.

సెల్‌టవర్ సేవలు ప్రారంభం



శరభవరంలో ఎయిర్‌టెల్ సెల్‌టవర్

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి, శరభవరం గ్రామాల్లోని ఎయిర్‌టెల్ సెల్ టవర్ సేవలు ప్రారంభమయ్యాయి. సెల్ టవర్ సేవలు శుక్రవారం నుంచి అందుబాటులో రానున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలో 8 ఎయిర్‌టెల్ సెల్‌టవర్లను సంస్థ నిర్మిస్తోందని తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి చెప్పారు. ఇందులో బడదనాంపల్లి, శరభవరం, అనంతగిరి, ఉర్లాకులపాడులలో సెల్ టవర్ల నిర్మాణం పూర్తయినట్టు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో సంస్థ దశల వారీగా సేవలను విస్తృతం చేస్తోందన్నారు. ఇప్పటి వరకు సెల్‌సిగ్నల్ లేని గ్రామాల్లో సంస్థ టవర్లు నిర్మిస్తోందన్నారు. టవర్ల నిర్మాణం కోసం అవసరమైన స్థలాలను ఇప్పటికే సంస్థకు అప్పగించినట్టు తెలిపారు.

పాజిటివ్ కేసు నమోదు

రాజవొమ్మంగి: మండలంలోని గిరిజన తండా అప్పలరాజుపేటలో ఒకరికి గురువారం కోవిడ్ పాజిటివ్ నమోదైంది. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఆరుగురు వ్యక్తులకు కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేయగా ఒకరికి పాజిటివ్ నిర్ధారణ అయినట్టు డాక్టర్ లిఖిత తెలిపారు. ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు పాటించాలనాలన్నారు.